స్వర్గంలో బందీలు

బొంబాయి బస్సుడిపోకు ఎదురుగా ప్రసిద్ధమైన పార్కు. వచ్చేజనం, పొయ్యేజనం. సాయంకాలం కావడంచేత పొయ్యేజనంకన్నా వచ్చే జనమే ఎక్కువ. ఇద్దరు ఆర్టుస్టూడెంట్లు చెరొకపక్కా తిరిగి స్కెచెస్ వేసుకుంటూ, మధ్య మధ్య ఏదో సంప్రదించుకుంటున్నారు. అందులో ఒకడు వేస్తున్న స్కెచ్‌లు మరోరెండు నెల్లకి ఒక మరాఠీ పత్రికలో పడతాయి. రెండోవాడు తనకాలాన్ని వృథాచేస్తున్నాడు. వాడు బొమ్మలుగీసి జీవించలేడు. కాని వాడికా సంగతి తెలీటానికింకా కనీసం రెండేళ్లు పడుతుంది. చిత్రకారుడుగా పైకిరానున్న వాడికి రెండోచెయ్యి అవిటిదని తెలుసు, కాని ఆ మాట పైకి అనడు. ప్రస్తుతానికిద్దరూ సమానమే. ఇద్దరిదీ ఒకటే క్లాసు.

బొంబాయిలో ఎన్నోరకాల విద్యలు నేర్చుకోవచ్చు. ఎన్నో బతుకు తెరువులున్నాయి. కాని ఈ అవిటి చేతివాడు చిత్రకళ ఎందుకు ఏరుకున్నట్టు? మనకు తెలీదు. వాడికి, పాపం బొమ్మలంటే తగనిష్టం కావచ్చు. వాళ్లదగ్గర బంధువెవడైనా చిత్రకారుడుగా పేరు గడించి ఉండవచ్చు. లేదా వాడికి మరే చదువూ అబ్బక, బొమ్మలు గీసుకునైనా బతగ్గలుగుతాడేమోనని వాళ్ళ వాళ్ళు వాణ్ణి చిత్రకళాభ్యాసానికి బొంబాయి పంపివుండవచ్చు. వాడు మూడోక్లాసు చదువుతుండగా డ్రాయింగు మేస్టరు "నీకు డ్రాయింగు బాగావస్తుందిరా!" అని ప్రోత్సహించి ఉండవచ్చు. ఇటువంటి ప్రోత్సాహ బీజం అనేక సంవత్సరాల తర్వాత మొలకెత్తి మహావృక్షంలా తయారు కావటం కూడా కద్దు...

ఎడమచేతి పక్కగా పులులూ, సింహాలూ ఉండే బోనులున్నాయి. అక్కడ దిక్కుమాలిన వాసన, ఆ వాసనను భరించి చాలామంది ఆడా, మగా, పిల్లా, పెద్దా నిలబడి వున్నారు. ఉండి ఆ క్రూరమృగాలను చూసి భయంకరమైన సన్నివేశాలు ఊహించుకుంటున్నారు.

హోమియోపతి మందుల్లాగే భయం కూడా చిన్న చిన్న డోసుల్లో చాలా మేలు చేస్తుంది.

"ఈ కటకటాలే అడ్డం లేకపోతే మనం వీటికింత దగ్గరగా నిలబడ గలుగుదుమా?" అంటున్నాడొక వృద్ధుడు తన వృద్ధ పత్నితో.

వృద్ధపత్ని 'ఔ' నన్నట్టుగా ఏదో గొణిగింది. ఆవిడ అనుకుంటున్నది "ఈ సింహం

ఈ బోనులోంచి తప్పించుకుంటే అది ముసలాడిమీద పడుతుంది గాని నామీద పడదు. ఎందుకు నామీద పడదో నాకు తెలీదు. కాని పడదంతే!"

ఆవిడ ధైర్యానికి కారణం కటకటాలే కావచ్చు. కాని ఆ కటకటాలే లేకపోతే సింహం తన భర్తమీదే పడుతుందన్న అనుమానానికి కారణం ఏమిటో మనకు తెలీదు.

ముసలి దంపతులిప్పటికి దాదాపు ముప్ఫైఏళ్లుగా, యుద్ధానికి ఒక సంవత్సరం ముందు నుంచీ బొంబాయిలోనే మకాం చేస్తున్నారు. వాళ్ళ స్వగ్రామం అట్టే దూరంలేదు. కల్యాణ్‌కు అవతలి స్టేషను. 1938లో బొంబాయి వచ్చి బాంబే - బరోడా సెంట్రల్ రైల్వేలో ఆయన ఉద్యోగం సంపాదించుకున్నాడు. అట్లాగే 'బీబీ' దాదర్లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అద్దె పదిరూపాయలు.

యుద్ధం వచ్చినప్పుడే వాళ్ళకో కొడుకుపుట్టాడు. వాడిప్పుడు ఐ.ఎ.ఎస్. వాడి నివాసం మలబార్ హిల్‌మీద. ముసలాడికి పింఛను వస్తుంది. అదీగాక కొడుకు నెలనెలా మూడువందలిస్తాడు. వీళ్ళుమాత్రం "బీబీ" దాదర్లో అదే భాగంలో అదే అద్దెకు ఉంటున్నారు.

ముసలావిడకు కొడుకుదగ్గర ఉండాలని! వాళ్లభాగం ఖాళీ చేసేట్టుంటే పదివేలు పగిడీ వస్తుంది. కాని ముసలాడికి డబ్బెందుకు? ఆయనకు కావలసింది జీవితం. అదేలేదు. ఇప్పటిక్కూడా ఆయన కలకంటే తమ పాతిల్లూ తమ స్వగ్రామంలో గడిపిన జీవితమూ కలలోకి వస్తాయి. ఆపుకోలేక ఒకసారి వాళ్లగ్రామం వెళ్లాడు. ఊరినిండా కొత్తవాళ్ళు, ఊరుమారింది. జీవితం మారింది. తాను తన పాత జీవితానికి తిరిగి పోదామన్నా అది అక్కడ లేదు...

చెట్లకింద పడుకుని కొందరు నిద్రపోతున్నారు. వాళ్లెవరో చెప్పటం కష్టం. నైట్ డ్యూటీకి పోయే కార్మికుడు కావచ్చు. ఇల్లు ఇరుకు, పిల్లలూ, ఏడుపులూ, పెళ్లాం కేకలూ మొదలైన కారణాలవల్ల ఇంటిదగ్గర నిద్రపోయే సౌకర్యం లేకపోవచ్చు. మరి కాసేపు నిద్రపోయి లేస్తాడు. ఇంటికి పోతాడు. ఇంత తిని పనికి బయలుదేరుతాడు.

ఎక్కడినుంచో పారిపోయివచ్చి మహానగరంలో అజ్ఞాతంగా తిరుగుతున్న నేరస్తుడు కావచ్చు. అలా అయే పక్షంలో చీకటిపడ్డాక లేచి ఎక్కడికి పోతాడో, ఏం చేస్తాడో మనకు తెలీదు. వాడికీ తెలీదేమో కూడా.

నిరుద్యోగి కావచ్చు.

కావచ్చు నేమిటి? అవును, ఆ పడుకున్నవారిలో ఒకడు ప్రస్తుతం నిరుద్యోగే. అతని పేరు ప్రకాశం. అతనిది తెనాలి తాలూకా జిమ్మిపల్లి గ్రామం, ఆ గ్రామంలో అతని తండ్రి పన్నెండెకరాల భూవసతి, పెద్ద పెంకుటిల్లూ పెట్టుకుని 'మహారాజు' లాగా బతికాడు. ఆ మానవుడు తనజీవితంలో "ఇది లేకపోయేనే" అనుకోలేదు. పాతర్లో ఏడాది పొడుగునా

ఎక్కి తొక్కినట్లు సరిపోయేధాన్యం. రెండు గేదెలపాడి, మెరక భూమిలో పండే కాయగూరలు, మనిషి అయినవాడికింకేం కావాలో ప్రకాశం తండ్రికి తెలీదు. ఆంజనేయస్వామి గుడికి ప్రతి శనివారమూ వెళ్ళి, అందరికన్నా గట్టిగా భజన చేసేవాడు. సృష్టిలో ఎందరు దేవుళ్ళుంటే అందరితోనూ ఆయన సఖ్యంగా ఉన్నాడు. ఏ దేవుణ్ణీ వేధించుకు తినలేదు. ఎవరికీ లంచాలు ఆశ పెట్టలేదు. మొక్కులు మొక్కలేదు. అందుకే అందరు దేవుళ్ళూ ఆయనపట్ల కనికరించినట్టున్నారు.

జీవితంతో అంత అన్యోన్యంగా జీవించినవాణ్ణి ఊళ్లో అందరూ ఆదరించారు గాని ప్రకాశం మెచ్చలేదు. తన తండ్రిబతుకు "వానపాము" బతుకు. అది బురదలో పుడుతుంది. బురదలో ఆప్యాయంగా జీవిస్తుంది. అందులోనే నశించి, ఎరువైపోతుంది. తన తండ్రికూడా అట్లాగే జీవించాడు. దాన్ని జీవించటమంటారా? బురద మట్టి నిజంగా జీవిస్తుందా?

"నిజంగా జీవించటం" అనేదాన్ని నిర్వచించటమంటే ప్రకాశం బహుశా చెప్పలేకపోయే ఉండును. కాని అతనికి ఒకటి ఖచ్చితంగా తెలుసు. జిమ్మిపల్లిలో ఉండి ఎవడూ నిజంగా జీవించలేడు.

నిజమైన జీవితం పొద్దున్నే కాఫీ హోటలుతో ప్రారంభమై రాత్రి సెకండ్‌షో సినిమాతో ఆఖరవుతుంది. ఈ మధ్యకాలంలో వీలయినన్ని పనులు చెయ్యాలి. అనుభవం పొందాలి.

ప్రకాశానికి చాలా ఇష్టమైన మాట "అనుభూతి". వాళ్లనాన్న అనుభూతిలేని జీవితం గడిపాడు. తాను స్కూలు ఫైనలు పాసయే లోపునే తన తండ్రి జన్మలో ఎన్నడూ పొందని అనుభూతులన్నీ పొందాడు. అయనకన్న ఎక్కువమంది పరిచయం సంపాదించాడు. తన తండ్రికి బాలగోపాల తరంగం లాంటి రెండు మూడు తరంగాలూ, ఒకటి రెండు ఆధ్యాత్మ రామాయణ కీర్తనలూ తప్ప ఏమీరావు. తనకు నూటఅరవై ఎనిమిది సినిమాపాటలు వచ్చు. అనేక వందలసార్లు రేడియో విన్నాడు. వందలకొద్దీ సినిమాలు చూశాడు.

లేదు. లేదు. తన తండ్రి తనతో పోలిస్తే నూరోవంతు జీవించలేదు.

అప్పుడే ఏమయింది? తనకింకా ముందెంతో జీవితం ఉన్నది. అంతెందుకు? తను బియ్యే చదువుతుండగా తండ్రి పోగానే కాలేజికి గుడ్‌బై కొట్టి బెజవాడలో ఉన్న రెండేళ్ళలో ఎన్ని విషయాలు నేర్చుకోలేదు? తన జీవితం ఎన్ని కొత్త మొగ్గలు తొడగలేదు?

నిజం చెప్పాలంటే, ఆ రెండేళ్ళలో ప్రకాశం ఎంతగా పెరిగాడంటే, అతనికి బెజవాడ ఇరుకై పోయింది. కనీసం మద్రాసులో ఉంటేగాని లాభంలేదు.

ప్రకాశం తొందరపడి మద్రాసు వెళ్ళాడని అతని శత్రువులు కూడా అనలేరు.

మద్రాసు పోవాలని నెలరోజులు తహతహలాడి మరీ బయలుదేరాడు. తలుచుకున్ననాడే రైలెక్కితే అతన్ని కాదనే వాళ్ళెవరు? ఒకరోజు కాదు రెండురోజులు కాదు. మద్రాసు జీవితంకోసం నెల రోజులపాటు తపించి మరీ రైలెక్కాడు.

బెజవాడలో ఉన్న రెండేళ్లలోనూ ప్రకాశం రెండెకరాలు అమ్మాడు. ఈ రెండేళ్లలోనూ అతనికి ఇద్దరు ఆసామీలు పిల్లనిచ్చి పెళ్ళిచేస్తామని కూడా అన్నారు. కాని ఎవరూ రెండువేలు మించి కట్నం ఇవ్వజూపలేదు. ప్రకాశానికి చాలా అవమానమయింది. బి.ఇడి చదివి లెక్కల మేస్టరుగా పనిలో చేరిన వైకుంఠానికి నాలుగువేలు కట్నం ఇచ్చి సక్కులాంటి పిల్లనిచ్చారు. వెధవకు పేక ముక్కల పేర్లయినా తెలీవు, కిందటినెల విడుదలైన పిక్చర్లెన్నిటిలో రేలంగి వేషం కట్టిందీ చెప్పలేడు.

ప్రకాశం ఆలోచించాడు. పెళ్ళి కావలసిన ఆడపిల్లలు మద్రాసులోనూ ఉన్నారు. తాను డబ్బు సంపాదించటమే సమస్య అయినట్టయితే మద్రాసులోనూ సంపాదించుకోవచ్చు.

నిన్నటిదాకా అంటే ప్రకాశం మద్రాసు బయలుదేరటానికి నెలక్రితందాకా వాళ్ళో వీళ్ళో ఇప్పించిన కాఫీలు కతుకుతూ బీడీలు కాల్చిన భాస్కరంగాడు, తానిచ్చిన పాతచొక్కాలు తొడుక్కుని తిరిగినవాడు ఏదో సినిమా కంపెనీవాళ్లు పిలవగా, తన దగ్గరే రైలు చార్జీలు అరువు పుచ్చుకొని, మద్రాసు రైలెక్కి వెళ్లాడు. సినిమా కంపెనీవాళ్లు వాణ్ణి కాస్తా బుక్ చేశారు. ఎడ్వాన్సిచ్చారు. భాస్కరం ఈ శుభవార్త తెలుపుతూ అప్పు పుచ్చుకున్న డబ్బు పంపేశాడు.

అది అందిన మర్నాడే ప్రకాశం మాద్రాసుకు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్టు 'కోయించి' మరీ రైలెక్కాడు.

ఏమనిషిగాని కొత్తచోటికి అడుగు పెట్టినప్పుడు అక్కడి జీవితం, కొలతలు తీసుకుని దర్జీవాడు కుట్టిన చొక్కాలాగా అమరదు. మద్రాసు జీవితం కొద్దిరోజులపాటు ప్రకాశానికి వదులు అయింది.

అఫ్‌కోర్స్, మొదట్లో ప్రకాశానికి భాస్కరమే హోస్ట్. నెల్లాళ్ళలో భాస్కరంలో కలిగిన మార్పు ప్రకాశానికి వర్ణనాతీత మనిపించింది. వాడు తనని రిసీవ్ చేసుకోటానికి స్టేషనుకు రావడమే సినిమా హీరో వేషంలో టెరిలీన్‌పాంటూ, టీ షర్టుతో సహా వచ్చాడు.

"అరే నీ జుట్టేమిటి అలా మారిపోయింది!" అన్నాడు ప్రకాశం.

"కలర్ చేయించాను. కనిపించటం లేదా?" అన్నాడు భాస్కరం నవ్వుతూ.

బెజవాడలో లాగ భాస్కరాన్ని పేట్రనైజ్ చేద్దామని ప్రకాశం ప్రయత్నించాడు. కాని అది సాధ్యంగా కనపడలేదు. పైపెచ్చు వాడు రేసులో గెలిచిన వాడిలాగా కనిపించాడు. వాడితో రెండురోజులపాటు తిరిగిన మీదట సినిమా ప్రొడ్యూసర్లూ, ఒకరిద్దరూ జర్నలిస్టులూ,

ఒక తార, కాస్త వయసు మళ్ళినదే అవుగాక వాడితో మాట్లాడటం చూసినాక భాస్కరం ప్రకాశానికి మరో మనిషిలాగా కనపడసాగాడు.

అందాకా ఎందుకు? భాస్కరం ఫ్రెండునని చెప్పుకోవడం ప్రకాశానికి ఒక గౌరవంగా కూడా కనపడింది.

అయితే మద్రాసు జీవితం ప్రకాశానికి త్వరలోనే వదులుకావటం మానేసింది. అంటే దాని ప్రమాణానికి ప్రకాశం పెరిగాడు. అట్లా పెరిగేశక్తి ఒక్క హనుమంతుడికే ఉందనుకోవటం పొరపాటు. 'ఏరోయ్ నీకు పట్నం నీళ్లు వంటబట్టినట్టున్నాయ్!' అని ఎవరన్నా అంటే 'పట్నం ప్రమాణానికి అప్పుడే పెరిగినట్టున్నావే' అని కాంప్లిమెంటు చేస్తున్నారన్న మాట.

వచ్చి నెల తిరగకముందే ప్రకాశం, "మనకు మద్రాసు కొట్టిన పిండేగా!" అనదగిన స్థితికి వచ్చాడు.

పట్నం బాగుంది. పట్నం జీవితం మోతగా ఉన్నది కాని -

సినిమా ఫీల్డు చుట్టూ లోతైన అగడ్తలూ, బలమైన ప్రాకారాలూ ఉన్నట్టు కనపడ్డాయి. ప్రకాశమేమో తాను సినిమా రంగంలో తప్ప ప్రకాశించలేనని రూఢి చేసుకున్నాడు.

సినిమా రంగానికి చాలా గేట్లున్నాయి. నువు ప్రొడ్యూసరువు కావచ్చు. డైరెక్టరువు కావచ్చు. అసిస్టెంటు కావచ్చు. చిల్లరనటుడు కావచ్చు. ప్లేబాక్ పాటగాడు కావచ్చు. మ్యూజిక్ డైరెక్టరో, అతని అసిస్టెంటో, తబలా వాయించేవాడో కావచ్చు. చిల్లర డ్యాన్సరుకావచ్చు. టెక్నీషియనులలో ఒకడైనా కావచ్చు. కెమెరా తోసేవాళ్లుకూడా సినిమా కారుల్లో జమే! కాని ఇంతమందికున్న ద్వారాలలోని ఒకటీ ప్రకాశం కోసం తెరుచుకుని లేదు.

జీవితంమీద ఆశలు పెట్టుకుని స్వశక్తితో సఫలం చేసుకోలేనివాడు నాస్తికమతం అవలంబించి లాభంలేదు. కలలు నిజమైన మేటి సినిమాకారులకే వెంకటేశ్వరస్వామి ఇష్టదైవం. కాంట్రాక్టుమీద సంతకం పడిన మర్నాడే భాస్కరం తిరపతి వెళ్ళొచ్చాడట. అది మొదలు అతను నెలకొకసారి వెంకటేశ్వరస్వామిని సందర్శించి వస్తున్నాడు. అతనివెంట ప్రకాశంకూడా రెండుసార్లు తిరపతికి వెళ్ళి, సినిమా రంగంలో తాను సంపాదించే మొదటి వెయ్యిలో సగం వెంకటేశ్వరుడికిస్తానని మొక్కుకున్నాడు.

మూడో నెలలో డబ్బింగ్ పిక్చరుకు ప్రొడ్యూసరయే అవకాశం ప్రకాశానికి వచ్చింది. దాని కోసం ప్రకాశం అయిదెకరాలు అమ్మాడు. అతని జీవితానికి రెక్కలు వచ్చాయి. డబ్బింగ్ హీరోయిన్‌తో స్నేహం కలిసింది. డబ్బింగ్ హీరోతో మరొక రకం స్నేహమయింది.

డబ్బింగ్ పిక్చరు రిలీజై దెబ్బతిన్నది. కాని అదే సమయానికి మొదలైన గుర్రప్పందాలు ప్రకాశానికి అచ్చి వచ్చాయి. డబ్బింగ్ హీరోకు గుర్రప్పందాల తరవాతే మరేదైనా!

అయిదారు వారాలు తిరిగే లోపల రేసుల్లో ప్రకాశం జీవితం ఎటువంటిదో సైంటిఫిక్‌గా తేలిపోయింది. ప్రకాశం తానై డబ్బు కాయకపోతే అతను గెలుస్తుందన్న గుర్రం గెలుస్తుంది!

'మీరాడకండి మేష్టరుగారూ! మీరు గుర్రం చెప్పండి, నేను కాస్తాను. లాభం చెరిసహం' అన్నాడు డబ్బింగ్ హీరో.

ఆ సీజనులో ఇద్దరూ చెరో వెయ్యి గెలిచారు. ఆ ఆనందంలో ప్రకాశం తనడబ్బు నలభైవేలు డబ్బింగ్‌లలో స్వాహా అయిన బాధకూడా మరిచాడు. అసలు సినిమా రంగాన్నే మరిచాడనవచ్చు.

బొంబాయిలో రేసులారంభమయ్యాయి. భాగస్వాములు బొంబాయి వెళ్ళారు. బొంబాయిలో ఇరవై నాలుగు గంటలు గడిపాక ప్రకాశం 'ఉంటే బొంబాయిలో ఉండాలి' అని లేకపోతే ఏం చెయ్యాలో చెప్పలేదు.

మద్రాసు ఈక్వేషను బొంబాయిలో పారలేదు. ప్రకాశం చెప్పిన గుర్రాలు మహాలక్ష్మి రేస్ కోర్స్‌లో నెగ్గలేదు. డబ్బింగ్ హీరో 'మేష్టరుగారు' చెప్పిన గుర్రంమీద కాకుండా ఇతర గుర్రాలమీద డబ్బుకాసి, కొంతలో కొంత లాభం పొందాడు. లాభం చెరి సహం అన్న ఏర్పాటు ఉద్వాసన అయిపోయింది.

డబ్బింగ్ హీరో ఇంకోవిషయం కూడా కనిపెట్టాడు. ప్రకాశం తన వెంట రావటానికి పడని రోజున అతను అయిదారువందలు సంపాదించుకున్నాడు. ఆ తరువాత అతను ప్రకాశాన్ని తన వెంట రేస్ కోర్సుకు రానివ్వలేదు. హోటలుకు తిరిగివచ్చి, ఆ రోజు తన అదృష్టం ఎల్లా ఉండినదీ చెప్పేవాడుకాడు. 'అంత పెద్దగా నష్టం రాలేదు... కిందటిసారి వచ్చిన నష్టం పూడిందని చెప్పొచ్చు...' ఈ ధోరణిలో మాట్లాడేవాడు.

ఇద్దరికీ మధ్య జీవితం పెద్ద బీట పెట్టింది.

సీజన్ ఇంకో వారంలో ముగుస్తుందనగా ఒకనాడు ప్రకాశం చుట్టుపక్కల వీథులన్నీ బలాదూరు తిరిగి హోటలుకు చేరుకునేసరికి, 'మీరు వెళ్ళిపోలేదా?' అని రిసెప్షనిస్టు అడిగాడు.

డబ్బింగ్ హీరో గంటక్రితమే హోటలు బాకీ చెల్లించి పెట్టే బేడా తీసుకుని, గదిఖాళీ చేసి వెళ్ళిపోయాడని తెలిసింది.

ఆ హోటల్లోనే ఉంటున్న ఒక తెలుగువాడు ప్రకాశాన్ని చూసి జాలిపడ్డాడు. కాని ప్రకాశం అతని దగ్గరకూడా పెద్దఫోజువేసి, తాను ప్రొడ్యూసరుననీ, రెండోవాడు తన మోచేతి క్రింద నీళ్ళు తాగిన ఆర్టిష్టనీ ప్రగల్భాలు పలికాడు.

"మీకు రైలు చార్జీలు అప్పు పెడతాను. మద్రాసుపోయి పంపండి" అన్నాడు.

అది ప్రకాశానికి చాలా అవమానంగా తోచింది. అతను అప్పటికే బొంబాయి జీవితపు ప్రమాణానికి పెరిగి ఉన్నాడు.

"ఎబ్బే! బొంబాయిలోనే ఉండాలండి! మద్రాసు చాలా ఛండాలం, వెధవ తిండి! వెధవ మనుషులు! రొచ్చుగుంట! ఈ బొంబాయిలాంటి చోట కూలిచేసుకు బతికినా మేలే" అన్నాడు.

"మీకు వెంటనే ఏదన్నా ఉద్యోగం కావాలంటే ఏర్‌లైన్స్‌లో ట్రైచెయ్యగలను అందులో నాకో ఫ్రెండున్నాడు" అన్నాడు తెలుగతను. అతను వెయ్యిరూపాయల జీతం తెచ్చుకునే బ్రహ్మచారి. బొంబాయిలో ఇళ్ళు దొరకవు గనక, హోటల్లోనే రెండు మూడేళ్ళుగా ఉంటున్నాడు.

"ఏం బొంబాయి జీవితం లెస్తురూ? ఇల్లూ, వాకిలీ లేదు, పెళ్ళామూ, పీచూ లేదు. సంపాదనలో ముప్పాతికా మువ్వీసం ఇక్కడి హోటల్ ప్రొప్రయిటర్స్‌నూ, టాక్సీలవాళ్ళనూ, దర్జీలనూ, మిగతా వాళ్ళనూ పోషించటానికే సరిపోతున్నది. మన ప్రాంతాల్లో ఇందులో సగం జీతం వచ్చినా హాయిగా జీవిస్తున్నామనిపించును. చూస్తూ చూస్తూ వెయ్యిరూపాయల ఉద్యోగం వొదులుకోలేను. డబ్బుకు బానిసలం" అన్నాడతను.

"నాకూ కొన్ని స్కీములున్నాయి లెండి, వాటిని ఈ బొంబాయిలోనే కారీ ఔట్ చెయ్యాలి. ప్రస్తుతానికి మీరు చెప్పిన ఉద్యోగం ఇప్పించారంటే కాస్త కాలు నిలదొక్కుకుంటాను" అన్నాడు ప్రకాశం.

ఒకవారంలో ప్రకాశానికి ఉద్యోగం వచ్చింది. జీతం డబ్బులు హోటల్లో ఉండటానికి చాలవు. ఎక్కడో మలాడ్‌లో ఉండే ఒక కొలీగ్ ఇంట పేయింగ్ గెస్టుగా కుదిరి దాదాపు సంపాదన రాళ్ళన్నీ ఇచ్చుకుంటూ, సీజన్ టిక్కెట్టుమీద తిరుగుతూ ఒకేడాది గడిపాడు.

ఇంతలో రిట్రెంచ్‌మెంట్ వచ్చింది. ఉద్యోగం ఊడిన వాళ్లలో ప్రకాశం కూడా ఉన్నాడు. మిగిలిన వాళ్ళు సమ్మె నోటిసిచ్చారు. ఏం కాబోతుందో తెలీదు. మూడురోజుల నుంచీ ప్రకాశం స్వేచ్ఛాజీవి, ఆ మాటకు అర్థం ఏమన్నా ఉంటే.

ప్రకాశం పడుకున్న చోటినుంచి లేచి ఇవతలకు వస్తూ పులులబోను దగ్గర ఆగాడు.

బోనులో ఆడపులి నిశ్చింతంగా పడుకుని ఉన్నదిగాని మగది తెగ తారట్లాడుతూ, ఛాన్సు దొరికితే ఎటైనా సరే పారిపోవటానికి సిద్ధంగా ఉన్నట్లున్నది.

ప్రకాశాన్ని ఆపేవాళ్లెవరూ లేరు. కాని అతను బొంబాయి నగరానికి బందీ.

ముద్రణ : ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 18 ఆగస్ట్ 1967